సాక్షి
ఖమ్మం
గురువారం, 3, ఆగస్టు, 2023



కలవరపెడుతున్న కలక

అన్ని వయసుల వారిని కళ్ల కలక ఆందోళనకు గురిచేస్తోంది. ఒకరి నుంచి ఇంకొకరికి వ్యాపిస్తుండడంతో ఇబ్బంది పడుతున్నారు. 8లో



వీడని జంట హత్యల మిస్టరీ

సత్తుపల్లి మండలం నారాయణపురంలో జరిగిన తల్లీకుమారుడి హత్య కేసు విచారణ ఇంకా ఓ కొలిక్కి రాలేదు. 8లో

గరిష్టం / కనిష్టం
33° / 25°

వాతావరణం

గురువారం జిల్లాలో సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. ఎక్కడ కూడా వర్షం కురిసే సూచనలు లేవు.

న్యూస్‌రీల్

మంత్రి పువ్వాడను కలిసిన ఆర్టీసీ ఉద్యోగులు



మంత్రికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఉద్యోగులు

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని నిర్ణయించిన నేపథ్యాన ఉద్యోగులు పలువురు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈమేరకు మంత్రిని హైదరాబాద్‌లో కలిసిన వారు పుష్పగుచ్ఛం అందజేసి మాట్లాడారు. నాయకులు థామస్‌రెడ్డి, యాదయ్య, నరేందర్, కమలాకర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పౌరసరఫరాల శాఖాధికారిగా శ్రీలత



ఖమ్మం సహకారనగర్: జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి (డీసీఎస్‌ఓ)గా జి.శ్రీలత నియమితులయ్యారు. ఇక్కడ ఇన్‌చార్జ్‌గా డీసీఎస్‌ఓగా విధులు నిర్వర్తించిన రాజేందర్ మహబూబాబాద్‌కు బదిలీ కావడంతో హైదరాబాద్‌లోని కమిషనర్ కార్యాలయంలో పనిచేస్తున్న సి.పద్మజను కేటాయించారు. అయితే, ఆమె ఇప్పటి వరకు విధుల్లో చేరలేదు. తాజాగా తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి కల్పించగా తల్లాడ తహసీల్దార్ జి.శ్రీలత కూడా పదోన్నతి లభించడంతో సిద్దిపేట ఎస్‌డీసీ(ఎల్‌ఏ)–2గా కేటాయించి డిప్యూటేషన్‌పై ఖమ్మం డీసీఎస్‌ఓగా నియమించారు.

తహసీల్దార్లకు పోస్టింగ్

- తల్లాడ మినహా అన్ని మండలాల్లో భర్తీ

ఖమ్మం సహకారనగర్: రాష్ట్రవ్యాప్తంగా పలువురు తహసీల్దార్లను మంగళవారం బదిలీ చేయగా జిల్లా నుంచి 17మందికి స్థానచలనం కలిగింది. అలాగే, ఇతర జిల్లాల నుంచి ఖమ్మంకు 20మందిని కేటాయించడంతో వారు బుధవారం రిపోర్ట్ చేశారు. వీరికి కలెక్టర్ గౌతమ్ పోస్టింగ్ ఇవ్వడంతో ఆ వెంటనే బాధ్యతలు స్వీకరిస్తున్నారు. ఈమేరకు వైరా తహసీల్దార్‌గా కే.వీ.శ్రీనివాసరావును కేటాయించగా, పెనుబల్లికి ఏ.రాజేంద్రప్రసాద్, సింగరేణి మండలానికి వి.సురేష్‌కుమార్, కామేపల్లికి శివయ్య, ఖమ్మం రూరల్‌కు పీ.వీ.రామకృష్ణ, ఏన్కూరుకు సీ.హెచ్.శేషగిరిరావు, ఎర్రుపాలెంలో ఎం.ఉషాశారదకు పోస్టింగ్ ఇచ్చారు. అలాగే, రఘునాథపాలెంకు జి.లూథర్‌విల్సన్, మధిరకు సీ.హెచ్.స్వామి, వేంసూరుకు ఎం.ఏ.రాజు, కొణిజర్లకు ఈ.నాగేశ్వరరావు, కల్లూరుకు వి.రవికుమార్, బోనకల్‌కు ఏ.పున్నంచందర్, చింతకానికి ఏ.రమేష్, సత్తుపల్లికి కె.యోగేశ్వర్‌రావు, కూసుమంచికి ఎస్.సంపత్‌కుమార్, నేలకొండపల్లికి డి.మంజుల, తిరుమలాయపాలెంకు పి.రాంప్రసాద్, ముదిగొండకు వై.రామారావు, ఖమ్మం అర్బన్‌కు విజయ్‌భాస్కర్‌ను కేటాయించగా, వీరిలో కొందరు బాధ్యతలు స్వీకరించారు.

మైనార్టీ అభ్యర్థులకు గ్రూప్‌-3 ఉచిత శిక్షణ

ఖమ్మంమయూరిసెంటర్: గ్రూప్‌–3 పరీక్షకు సిద్ధమవుతున్న మైనార్టీ అభ్యర్థులకు మైనార్టీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యాన ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖాధికారి ఎం.ఏ.మహమూది తెలిపారు. రెండు నెలల పాటు కొనసాగే శిక్షణ కోసం అర్హత, ఆసక్తి కలిగిన ముస్లిం, క్రైస్తవ, సిక్కు, బౌద్ధ, జైనులు, పార్సీలు ఈనెల 6లోగా తమ కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని సూచించారు. తహసీల్దార్ నుంచి జారీ చేసిన ఆదాయ ధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డు, ఎస్‌ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ మెమోలు, గ్రూపు–3 దరఖాస్తు కాపీ, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు జత చేయాలని తెలిపారు. ఇతర వివరాలకు 08742–293565 నంబర్‌లో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

రైల్వేలైన్ అలైన్‌మెంట్ మార్పునకు చర్యలు

- ఎంపీ నామ లేఖలకు రైల్వే జీఎం సమాధానం

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా ప్రజలు, రైతులకు నష్టం కలిగించనున్న డోర్నకల్ – మిర్యాలగూడ రైల్వే లైన్ అలైన్‌మెంట్ మార్పు అంశాన్ని పరిశీలిస్తామని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అనిల్‌కుమార్‌జైన్ వెల్లడించారు. రైతుల వినతితో బీఆర్‌ఎస్ లోక్‌సభా పక్షనేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు జీఎంకు లేఖలు రాశారు. దీంతో బుధవారం సమాధానం అందిందని ఎంపీ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాకు ఎలాంటి ఉపయోగం లేని రైల్వేలైన్ అలైన్‌మెంట్ మార్చాల్సిందేనని, నూతన మార్గాన్ని జిల్లాలో అనుమతించే ప్రసక్తే లేదని తాను లేఖలు రాయగా, సమస్య పరిష్కరిస్తామని జీఎం సమాధానం ఇచ్చారని వెల్లడించారు.

అసెంబ్లీకి వేళాయె..

నేటి నుంచి శాసనసభ వర్షాకాల సమావేశాలు

- మరిన్ని నిధులు కోరుతామంటున్న అధికార పార్టీ ఎమ్మెల్యేలు
- ఆర్టీసీ విలీనం బిల్లు ప్రవేశపెట్టనున్న మంత్రి పువ్వాడ
- సమస్యలను ప్రస్తావిస్తానన్న సీఎల్పీ నేత భట్టి



సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఓ పక్క ఎన్నికలు సమీపిస్తుండగా.. చివరిసారిగా జరగనున్న శాసనసభ వర్షాకాల సమావేశాల్లో వివిధ అంశాలపై చర్చించేందుకు జిల్లాకు చెందిన అధికార, ప్రతిపక్ష ఎమ్మెల్యేలు సిద్ధమయ్యారు. ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధితోపాటు పెండింగ్ పనుల పూర్తి కోసం నిధులు మంజూరు చేయించుకునే పనిలో అధికార పార్టీ ఎమ్మెల్యేలు నిమగ్నమయ్యారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలన్న కేబినెట్ నిర్ణయాన్ని బిల్లుగా రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నారు. ఇక సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క జిల్లాలో పరిష్కారం కాని సమస్యలపై అసెంబ్లీ వేదికగా ప్రస్తావిస్తానని చెబుతున్నారు.

సద్వినియోగం చేసుకునేలా..

సాధారణ ఎన్నికల ముందు చివరిసారి జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎమ్మెల్యేలు భావిస్తున్నారు. నియోజకవర్గాల్లోని సమస్యలను సభ దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరు కోసం గట్టిగా ప్రయత్నిస్తామని చెబుతున్నారు. గతంలో నియోజకవర్గాలకు మంజూరైన పనులను కార్యరూపంలో పెట్టేందుకు అసెంబ్లీ సమావేశాలను ఉపయోగించుకోనున్నారు. అధికార, ప్రతిపక్ష శాసనసభ్యులు ఈ అసెంబ్లీ సమావేశాలపై ప్రత్యేక దృష్టి సారించగా.. మంత్రులు, సంబంధిత శాఖల అధికారులను కలుస్తూ అవసరమైన పనులు, పథకాలు మంజూరు చేయించుకోవాలనే బహుముఖ వ్యూహంతో ఉన్నట్లు తెలుస్తోంది.



‘విలీనం’ బిల్లు ప్రవేశపెట్టబోతున్నా..

ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే బిల్లును అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టనున్నాను. బిల్లు పాసైన అనంతరం ఆర్టీసీ కార్మికులు ప్రభుత్వ ఉద్యోగులుగా మారతారు. ఈ ప్రక్రియ నా చేతుల మీదుగా జరుగుతుండడం ఆనందంగా ఉంది. ఇక జిల్లాలో ఇచ్చిన, ఇవ్వని హామీలన్నింటినీ అమలుచేశాం. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో మెడికల్ కళాశాలలు మంజూరు చేసుకున్నాం. మున్నేటికి ఇరువైపులా రూ.150 కోట్లతో ఆర్‌సీసీ కాంక్రీట్ వాల్ మంజూరైంది. తీగల వంతెన పనులు కూడా త్వరలోనే ప్రారంభమవుతాయి.

– పువ్వాడ అజయ్‌కుమార్, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి



హామీలు నెరవేరలేదు..

ప్రభుత్వం ఇచ్చిన ఏ హామీ నెరవేరలేదు. సీఎం కేసీఆర్ భద్రాచలానికి నిధుల మంజూరుపై చేసిన ప్రకటన ఊసే లేదు. గోదావరి వరదతో భద్రాచలంను ముంపు నుంచి తప్పించేందుకు ఏ చర్యలు తీసుకోలేదు. సీతారామ ప్రాజెక్టు పనులు ముందుకు సాగడం లేదు. మున్నేరుకు వరదలతో అనేక ఇళ్లు నీట మునిగాయి. ముందు జాగ్రత్త లేకపోవడంతోనే ఈ పరిస్థితి వచ్చింది. ఈ సమస్యలే కాక వరదలతో నష్టపోయిన వారికి పరిహారం ఇవ్వాలనే విషయాన్ని ప్రస్తావిస్తా. ప్రజా సమస్యలపై ప్రభుత్వం నుంచి సమాధానాలు రాబడుతాం.

– మల్లు భట్టి విక్రమార్క, సీఎల్పీ నేత, మధిర ఎమ్మెల్యే



అభివృద్ధి నిధులు కోరతా..

నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎస్‌డీఎఫ్ నిధులు రూ.125 కోట్లు కేటాయించాలని అసెంబ్లీలో కోరుతా. అలాగే, ఇప్పటికే ప్రకటించిన ఇంజనీరింగ్ కళాశాల విషయమై జేఎన్‌టీయూ అధికారులతో చర్చిస్తున్నాం. నియోజకవర్గానికి మంజూరైన నర్సింగ్ కళాశాల పనులు త్వరగా ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరతాం. ఇవేకాకుండా కూసుమంచిలో జూనియర్ కళాశాల, తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలులో ఒకేషనల్ కాలేజీ, పాలేరు నియోజకవర్గంలో పది పడకలతో డయాలసిస్ సెంటర్ మంజూరు చేయాలని కోరతాను.

– కందాల ఉపేందర్‌రెడ్డి, పాలేరు ఎమ్మెల్యే



సత్తుపల్లిని అభివృద్ధి చేశా..

మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బాటలో సత్తుపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశా. సత్తుపల్లిలో వంద పడకలు, పెనుబల్లి, కల్లూరుల్లో 50 పడకల ఆస్పత్రులు త్వరలోనే అందుబాటులోకి వస్తాయి. అలాగే నర్సింగ్ కాలేజీ ప్రారంభానికి సిద్ధమైంది. పాలిటెక్నిక్ కళాశాల కూడా అందుబాటులోకి రానుంది. పంచాయతీ కార్మికులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, గ్రామదీపికలు, డీఆర్‌డీఏ సిబ్బంది, గోపాలమిత్రల సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తా.

– సండ్ర వెంకటవీరయ్య, సత్తుపల్లి ఎమ్మెల్యే



రిజర్వాయర్ ఆధునికీకరణకు..

నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తున్నా. వైరా రిజర్వాయర్ ఆధునికీకరణకు నిధులు విడుదల చేయాలని అసెంబ్లీలో కోరుతా. అలాగే, 100 పడకల ఆస్పత్రి నిర్మించాలని కోరనున్నా. డిగ్రీ కళాశాల, నర్సింగ్ కళాశాల ఏర్పాటుతోపాటు గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కోసం అసెంబ్లీ సమావేశాల్లో చర్చిస్తాను. ఇవే చివరి సమావేశాలు కానున్న నేపథ్యంలో పూర్తిస్థాయిలో ఉపయోగించుకుని నియోజకవర్గానికి అత్యధికంగా నిధులు, పథకాలు మంజూరయ్యేలా కృషి చేస్తా.

– రాములునాయక్, వైరా ఎమ్మెల్యే

వీఆర్‌ఏలను బానిసలుగా మార్చింది కాంగ్రెస్సే..

అభినందన సభలో ఎమ్మెల్యే సండ్ర



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటవీరయ్య

కల్లూరు రూరల్: వీఆర్‌ఏలను కట్టుబానిసలుగా మార్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య విమర్శించారు. వీఆర్‌ఏల సర్వీస్‌ను క్రమబద్ధీకరిస్తూ ఇటీవల ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యాన కల్లూరులో బుధవారం అభినందన సభ ఏర్పాటుచేశారు. ఈ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వీఆర్‌ఏల ఆత్మగౌరవాన్ని సీఎం కేసీఆర్ పెంచారని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో వీఆర్‌ఏలు ముఖ్య పాత్ర పోషించాలని సూచించారు. తొలుత ఎమ్మెల్యేను వీఆర్‌ఏల జేఏసీ బాధ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏల జిల్లా జేఏసీ చైర్మన్ అజీస్, కార్యదర్శి లింగరాజు, జెడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, ఎంపీపీ అలేఖ్యతోపాటు అన్వర్, రఘు, రామకృష్ణ, కె.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ ‘2 ప్లస్’!

- కళాశాలకు అత్యుత్తమ గ్రేడ్ వెల్లడించిన న్యాక్
- వేలాది మందిని ఉన్నతులుగా తీర్చిదిద్దిన కళాశాల
- ఐదేళ్ల ప్రమాణాల ఆధారంగా ప్రకటన



ఖమ్మంలోని ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ కళాశాల

ఖమ్మం సహకారనగర్: వేలాది మందిని ఉన్నతులుగా తీర్చిదిద్దిన జిల్లా కేంద్రంలోని ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాలకు అరుదైన గుర్తింపు దక్కింది. న్యాక్ ప్రకటన కోసం అధ్యాపకులు, విద్యార్థులు, పూర్వవిద్యార్థులు ఎదురుచూస్తుండగా వారు ఊహించని విధంగా, రాష్ట్రంలో ఏ కళాశాలకు దక్కని ఖ్యాతి లభించింది. ఏకంగా న్యాక్(నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్) నుంచి ఏ ప్లస్ ప్లస్ గుర్తింపు ప్రకటన వెలువడడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్థానం ఇలా..

1956లో ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలగా ప్రారంభమైన ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ (శ్రీరామభక్త గెంటాల నారాయణరావు కళాశాల)కు నాడు వందల సంఖ్యలో విద్యార్థులుండగా... ప్రస్తుతం 4,108 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అలాగే, 103మంది అధ్యాపకులు, 33మంది అధ్యాపకేతర సిబ్బంది కొనసాగుతున్నారు. ఈ కళాశాల గతంలో నైట్ కళాశాలగా కూడా సేవలందించింది. ఇక్కడ చదువుకున్న వేలాది మంది ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. 2015–16వ విద్యాసంవత్సరంలో స్వయం ప్రతిపత్తి లభించగా, 33 యూజీ కోర్సులు, 9 పీజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. మూడు సార్లు న్యాక్ గుర్తింపు కోసం పోటీ పడగా రెండో సారి 2017లో బీ ప్లస్ ప్లస్ గుర్తింపు సాధించింది. అలాగే, ఈ ఏడాది ఏకంగా ఏ ప్లస్ ప్లస్ సాధించడం విశేషం. ఐదేళ్ల(2017–22) ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుని ఈ గ్రేడ్ ప్రకటించారు. విద్యార్థుల చదువు, పరిశోధన, ఉద్యోగాల కల్పన, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్, గ్రంథాలయం తదితర అంశాల ఆధారంగా కేటాయించిన ఈ గుర్తింపు ఐదేళ్ల పాటు అమల్లో ఉంటుంది.

మంత్రి కృషి కీలకం

ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలకు న్యాక్ గుర్తింపు రావటంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పూర్వ విద్యార్థిగా కీలకంగా వ్యవహరించారు. కళాశాల అభివృద్ధి, సౌకర్యాల కల్పనలో ముందు నిలిచిన ఆయనకు కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా, అధ్యాపకులు సీతారాం, కేయూ పాలకమండలి సభ్యులు రవిమారుత్ తదితరులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, కళాశాలకు న్యాక్ గుర్తింపు లభించడంపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ హర్షం చేస్తూ ఓ ప్రకటన విడుదల చేయగా, ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా, అధ్యాపకులు, ఉద్యోగులను అభినందించారు.

నేడు నులిపురుగుల నిర్మూలన దినోత్సవం

ఖమ్మం వైద్యవిభాగం: జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని గురువారం నిర్వహించనున్నారు. కడుపులో నులిపురుగులు చేరిన పిల్లలు పోషకాహార లోపంతో బాధపడుతూ, ఎప్పుడూ అలసటగా ఉంటారు. శారీరక పెరుగుదల, మానసిక అభివృద్ధి కూడా మందగిస్తుంది. వీటి నివారణకు జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం నిర్వహించనుండగా, జిల్లావ్యాప్తంగా 1–19 ఏళ్ల లోపు పిల్లలు 3,11,317 మంది ఉన్నట్లు గుర్తించా రు. ఈమేరకు విద్యాసంస్థల్లో పిల్లలతో మాత్రలు మింగించేందుకు ఏర్పాట్లు చేసినట్లు డీఎంహెచ్‌ఓ మాలతి వెల్లడించారు. ఎవరైనా పిల్లలు మిగిలిపోతే 10న ప్రత్యేక కార్యక్రమం చేపడుతామని తెలిపారు.

రుణమాఫీకి మోక్షం

నేటి నుంచి పునఃప్రారంభం

- జిల్లాలో అర్హులైన రైతులు 2,82,974 మంది
- రూ.2,330.67 కోట్ల మేర మాఫీకి గ్రీన్‌సిగ్నల్



ఖమ్మంవ్యవసాయం: రైతులు తీసుకున్న పంట రుణాల మాఫీ ప్రక్రియను పునః ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు సీఎం కేసీఆర్ బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షలో రుణమాఫీని గురువారం నుంచి మొదలుపెట్టాలని సూచించారు. నిర్దేశించిన విధంగా పూర్తిస్థాయిలో రైతుల పంటల రుణాలను విడతల వారీగా సెప్టెంబర్ 2నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. 2018 ఎన్నికల సమయాన రూ.లక్ష లోపు పంట రుణాలను మాఫీ చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిన విషయం విదితమే. ఆతర్వాత 2020 నుంచి శ్రీకారం చుట్టగా, 2014 ఏప్రిల్ 1 నుంచి నుంచి 2018 డిసెంబర్ 11 వరకు పంట రుణం తీసుకున్న రైతులను అర్హులుగా నిర్ణయించారు.

జిల్లాలో 42,347 మందికి మాఫీ

ప్రభుత్వం నిర్దేశించిన విధివిధానాలతో జిల్లాలో 3,25,321 మంది రైతులు రుణమాఫీకి అర్హులుగా తేల్చారు. వీరు తీసుకున్న రూ.2,424.36 కోట్లు మాఫీ చేయాల్సి ఉంది. 2020 డిసెంబర్ నుంచి తొలి విడతగా ప్రక్రియను ప్రారంభించి మొదటగా రూ. 25 వేల లోపు రుణాలు కలిగిన 55,981 మందిని గుర్తించారు. వీరిలో 21,978 మంది రుణాలకు సంబంధించి ఖాతాల్లో రూ. 28.455 కోట్లు జమ చేశారు. ఇంకా 34,003 రైతుల రుణాలు రూ.49.545 కోట్లు మాఫీ కావాల్సి ఉంది. ఆ తర్వాత రెండో విడతగా రూ.50 వేల వరకు తీసుకున్న రుణ మాఫీని 2021 ఆగస్టు నుంచి ప్రారంభించారు. రూ.50 వేల లోపు రుణాలు తీసుకున్న రైతులు 33,575 మంది రైతులు ఉండగా, వీరిలో ఖాతాల్లో రూ.106.88 కోట్లకు గాను రూ.69.21 కోట్లును జమ చేసింది. ఇంకా రూ.37.67 కోట్లు మిగిలిపోయాయి. మొత్తంగా ఇప్పటి వరకు జిల్లాలోని 42,347 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ. 97.69 కోట్లు జమయ్యాయి.

నేటి నుంచి మళ్లీ...

పంట రుణమాఫీ ప్రక్రియ రెండేళ్ల తర్వాత మళ్లీ మొదలుకానుంది. దీంతో జిల్లాలో రెండు విడతల్లో మిగిలిపోయిన రూ.లక్ష లోపు పంట రుణాలు కలిగిన రైతులకు లబ్ధి జరగనుంది. ప్రభుత్వం విడుదల చేసే విధివిధానాల ఆధారంగా ప్రక్రియ మొదలవుతుందని అధికారులు చెబుతున్నారు. కాగా, జిల్లాలో మిగిలిపోయిన 2,82,974 మంది రైతులకు చెందిన రూ. 2,330.67 కోట్లు రుణాలు మాఫీ అయ్యే అవకాశం ఉండడంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మాది రైతు ప్రభుత్వం...

రైతు రుణమాఫీ కార్యక్రమాన్ని గురువారం నుంచి పునః ప్రారంభించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు నిర్ణయించడంపై రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రైతాంగ సంక్షేమం, వ్యవసాయాభివృద్ధే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు. ఎన్ని కష్టాలొచ్చినా రైతులకు ఇచ్చిన మాట మేరకు రుణ మాఫీ చేస్తున్నట్లు మంత్రి ఓ ప్రకటనలో వెల్లడించారు.

ఇక కొత్త కిక్కు!

- నూతన ఎక్సైజ్ పాలసీ ప్రకటన విడుదల
- రేపటి నుంచి దరఖాస్తుల స్వీకరణ, 21న డ్రా
- జిల్లాలో 122 వైన్స్‌లకు గాను 89 షాపులకు రిజర్వేషన్



ఖమ్మంక్రైం: ఇంకో రెండు నెలల్లో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చే అవకాశం ఉందన్న అంచనాతో నవంబర్‌లో జరగాల్సిన మద్యం షాపుల లాటరీ ప్రక్రియను రాష్ట్రప్రభుత్వం ఇప్పుడే మొదలుపెట్టింది. ఈమేరకు నూతన ఎక్సైజ్ పాలసీకి సంబంధించి బుధవారం ప్రకటన వెలువరించింది. ఇందులో భాగంగా శుక్రవారం నోటిఫికేషన్ విడుదల కానుండగా అదే రోజు నుంచి 18వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయో తెలియకున్నా... ‘గిరాకీ’ బాగుంటుందనే ఉద్దేశంతో వైన్స్ దక్కించుకున్న పాత వారే కాకుండా ఔత్సాహికులు దరఖాస్తుకు సిద్ధమవుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో 230 వైన్స్

ఖమ్మం జిల్లాలో 122, భద్రాద్రి కొత్తగూడెంలో 88 వైన్స్‌కు సంబంధించి నోటిఫికేషన్ వెలువడనుంది. గతంలో మాదిరిగానే ఈసారి కూడా ఖమ్మం ఎక్సైజ్ స్టేషన్‌–1 కార్యాలయంతో పాటు దాని పక్కనే ఉన్న ఈఎస్ కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయం ఖమ్మంలోనే ఉండటంతో టెండర్ల స్వీకరణ ఏర్పాట్లపై అధికారులు ఇప్పటికే సమీక్షించారు.

రేపటి నుండి దరఖాస్తులు

వైన్స్‌ల కేటాయింపునకు ఈనెల 4నుండి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమవుతుంది. అలాగే, 18వ తేదీతో గడువు ముగియనుండగా, వచ్చిన దరఖాస్తుల నుంచి 21వ తేదీన డ్రా ద్వారా వైన్స్ కేటాయిస్తారు. అలాగే, వైన్స్ దక్కించుకున్న వారు 21, 22వ తేదీల్లో లైసెన్స్ ఫీజులో మొదటి విడత చెల్లించాల్సి ఉంటుంది.

డిసెంబర్ 1నుండి వైన్స్

డ్రాలో వైన్స్ దక్కించుకున్న వారి షాపులు డిసెంబర్ 1నుండి ప్రారంభమవుతాయి. వాస్తవానికి 2021–23 రెండేళ్ల ఎక్సైజ్ పాలసీకి ఏ–4 షాపుల గడువు నవంబర్ 30వ తేదీ వరకు ఉంది. అయితే, ఆలోగా ఎన్నికల నోటిఫికేషన్ వస్తే టెండర్ల ప్రక్రియ నిర్వహించేందుకు అవకాశముండదు. దీంతో ప్రభుత్వం ముందుగానే షాపుల కేటాయింపు పూర్తిచేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. కాగా, ప్రస్తుతం జరగనున్న డ్రాలో షాపులు దక్కించుకునేవారు నవంబర్ 30 సాయంత్రం వరకు మద్యం డిపో నుంచి స్టాక్ తీసుకుని డిసెంబర్ 1వ తేదీ నుంచి షాపులు ప్రారంభించాల్సి ఉంటుంది.

రిజర్వేషన్లు ఇలా

గత ఎక్సైజ్ పాలసీలో మాదిరిగానే ఈసారి కూడా ఎస్సీ, ఎస్టీలతో పాటు గౌడ కులస్తులకు వైన్స్‌లో రిజర్వేషన్ కేటాయించారు. జిల్లాలో 122 వైన్స్‌కు గాను 40 షాపులను ఎస్సీ, ఎస్టీ, గౌడలకు రిజర్వ్ చేశారు. ఇందులో గౌడలకు 18, ఎస్సీలకు 14, ఎస్టీలకు 08 కేటాయిస్తూ ప్రకటన వెలువడింది.

దరఖాస్తులతో రూ.220కోట్ల ఆదాయం

గత ఎక్సైజ్ పాలసీలో ఉమ్మడి జిల్లాలో వైన్స్ కోసం 11వేలకు పైగా దరఖాస్తులు అందాయి. ఒక్కో దరఖాస్తు ఫీజు రూ.2లక్షలుగా నిర్ణయించడంతో వీటి ద్వారానే రూ.220 కోట్లకు పైగా ఆదాయం ప్రభుత్వానికి సమకూరింది. ఈసారి కూడా దరఖాస్తు రుసుము అదే ఉండడం, ఎన్నికల సమయాన గిరాకీ బాగుంటుందనే భావనతో మరింత పోటీకి వస్తే ఆదాయం కూడా అదే స్థాయిలో పెరుగుతుందనే భావన వ్యక్తమవుతోంది.

సెక్టోరల్ అధికారుల పాత్రే కీలకం

ఎన్నికల ఉద్యోగుల శిక్షణలో కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారులది కీలకపాత్ర అని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం అధికారులకు మొదటి విడత శిక్షణ ఏర్పాటుచేయగా కలెక్టర్ మాట్లాడారు. ఒక్కో రిటర్నింగ్ అధికారి కింద 20 నుండి 30 వరకు సెక్టార్లు వుంటాయని, ఒక్కో సెక్టార్ అధికారి 10 నుండి 20 పోలింగ్ కేంద్రాలను పరిశీలించాల్సి ఉంటుందని తెలిపారు. ఈమేరకు ప్రతీ కేంద్రాన్ని తనిఖీ చేసి వసతులపై ఆరా తీయాలని, పరిస్థితులపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. ఆతర్వాత అధికారులకు ఈవీఎంల వినియోగంపై అవగాహన కల్పించారు.

గడువులోగా అనుమతులు

జిల్లాలో లేఔట్ల దరఖాస్తులను గడువులోగా పరిశీలించి నిబంధనల మేరకు అనుమతులు జారీ చేయాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన జిల్లా స్థాయి లేఔట్ అప్రూవల్ కమిటీ సమావేశంలో కేఎంసీ, వైరా, మధిర మునిసిపాలిటీలు, సుడా పరిధిలో అందిన 22దరఖాస్తులను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరి క్షేత్రస్థాయిలో పరిశీలించాకే అనుమతులు ఇవ్వాలని సూచించారు.

ప్రణాళికాయుతంగా పూర్తి చేయాలి

వైన్స్ కేటాయింపు ప్రక్రియను ప్రణాళికాయుతంగా పూర్తిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. నూతన మద్యం పాలసీలో భాగంగా దరఖాస్తుల స్వీకరణ మొదలుకానుండడంతో హైదరాబాద్ నుంచి ఆమె వీసీ ద్వారా సూచనలు చేశారు. ఈసందర్భంగా జిల్లా నుంచి కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ జిల్లాలో దరఖాస్తుల స్వీకరణ, డ్రా కోసం ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈసమావేశాల్లో అదనపు కలెక్టర్లు అభిలాష అభినవ్, మధుసూదన్ నాయక్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆదర్శ్ సురభి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేందర్‌రెడ్డి, సాంఘిక, గిరిజన, బీసీ సంక్షేమ శాఖల అధికారులు కె.సత్యనారాయణ, కృష్ణానాయక్, జి.జ్యోతి, అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా, కల్లూరు ఆర్డీఓ అశోక్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అసిస్టెంట్ కలెక్టర్‌కు సన్మానం


రాధికను సన్మానిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మంసహకారనగర్: అసిస్టెంట్ కలెక్టర్‌గా జిల్లాలో శిక్షణ పూర్తిచేసుకున్న రాధికాగుప్తాను బుధవారం కలెక్టరేట్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ అన్నిశాఖల్లో శిక్షణ పూర్తిచేసుకున్న ఆమె దళిత బంధు, దశాబ్ది ఉత్సవాల్లోనే కాక వరదల సమయాన విశేష సేవలందించారని కొనియాడారు. అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపునకు కృషి


మాట్లాడుతున్న డీఈఓ సోమశేఖర్‌శర్మ

ఖమ్మంఅర్బన్/సత్తుపల్లిరూరల్: విద్యావిధానంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని, ఇందుకు ప్రత్యేక శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ సోమశేఖర్‌శర్మ సూచించారు. ఖమ్మం నయాబజార్ పాఠశాలలో తొలిమెట్టు శిక్షణను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. అలాగే, సత్తుపల్లిలో జరుగుతున్న తొలిమెట్టు శిక్షణ తరగతులను కూడా పరిశీలించారు. సమావేశాల్లో జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి కె.రవికుమార్, ఎంఈఓలు శ్రీనివాస్, రాములుతో పాటు కేవీ.శైలజాలక్ష్మి, కె.గాయత్రి, టి.జీవన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎల్‌డీఎం ఇన్‌చార్జ్‌గా రామారావు


రామారావు

కొణిజర్ల: కాంగ్రెస్ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ మిషన్ (ఎల్‌డీఎం) ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా కొణిజర్ల సర్పంచ్ సూరంపల్లి రామారావు నియమితులయ్యారు. ఈ మేరకు ఏఐసీసీ ఎస్సీ సెల్ నుంచి బుధవారం ఉత్తర్వులు అందాయి. ఖమ్మం పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల పార్టీ శ్రేణుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించి, పార్టీ బలోపేతానికి రామారావు కృషి చేయాల్సి ఉంటుంది.

దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంమయూరిసెంటర్: ఐఐటీ, నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్ కోసం ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఖమ్మం ఆర్‌సీఓ ప్రత్యూష తెలిపారు. బాలికలకు హైదరాబాద్ గౌలిదొడ్డిలోని సీఓఈలో, బాలురకు రాజేంద్రనగర్‌లోని ఐఐటీ స్టడీ సెంటర్‌లో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఏడాది జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌లో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కలిపి 50 సీట్లు ఉండగా, ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 16వ తేదీలోగా రూ.200 డీడీ, ఇతర పత్రాలు జత చేసిన దరఖాస్తులను కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. పూర్తి వివరాల కోసం www.tswreis.ac.in, www.tgtwgurukulam.telangana.gov.in వెబ్ సైట్లలో సంప్రదించాలని ఆర్‌సీఓ తెలిపారు.

రేపు బీఏఎస్ డ్రా

ఖమ్మంమయూరిసెంటర్: బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం కింద ఒకటి, ఐదో తరగతుల్లో ప్రవేశాలకు ఈ నెల 4న డ్రా ద్వారా విద్యార్థులను ఎంపిక చేయనున్నారు. ఖమ్మం ఎన్నెస్పీ క్యాంప్‌లోని డీపీఆర్‌సీ హాల్‌లో ఈ డ్రా ఉంటుందని అధికారులు తెలిపారు.

అనుమతి లేకుండా చెట్లు నరికితే చర్యలు

నేలకొండపల్లి: అనుమతి లేకుండా ఎవరూ చెట్లు నరకొద్దని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని ఫారెస్ట్ రేంజర్ పి.శ్రీనివాసరావు స్పష్టం చేశారు. మండలంలోని సింగారెడ్డిపాలెంలో ఓ రైతు టేకు చెట్లు నరికేందుకు దరఖాస్తు చేసుకోగా బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. చెట్లు నరకాలంటే వాల్టా చట్టం ప్రకారం అనమతి తీసుకోవాలని తెలిపారు. ఆయన వెంట ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ డానియేల్, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

డెంగీ కేసు నమోదు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 8వ డివిజన్ గోపాలపురంలో డెంగీ కేసు నమోదైంది. దీంతో వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు గ్రామంలో బుధవారం శిబిరం ఏర్పాటుచేశారు. గ్రామానికి చెందిన ఓ న్యాయవాదికి డెంగీ సోకినట్లు గుర్తించిన అధికారులు, ఆయన ఇంటి చుట్టుపక్కల ఇళ్లలోని వారికి వైద్యపరీక్షలు నిర్వహించారు. అలాగే, దోమల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించినట్లు మంచుకొండ వైద్యాధికారి సంధ్యారాణి తెలిపారు. జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.13,091

కలవరపెడుతున్న కళ్ల కలక..


ఖమ్మం ఆస్పత్రిలో మహిళను పరీక్షిస్తున్న కంటి వైద్యనిపుణులు శ్రీధర్ గౌడ్

జిల్లాలో నానాటికీ పెరుగుతున్న బాధితులు

- విద్యాసంస్థల్లో ఎక్కువ ప్రభావం
- జాగ్రత్తలు తప్పనిసరి పాటించాలంటున్న కంటి వైద్యులు

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లాలో కళ్ల కలక కలవరపెడుతోంది. వ్యాధి బారిన పడేవారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా ఎక్కడ చూసినా కళ్ల కలకతో బాధపడుతున్నారు. చిన్నారులు ఎక్కువగా దీని బారిన పడుతుండటంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. ఒకరి నుంచి మరొకరికి సోకే వ్యాధి కావటంతో నిత్యం వందల సంఖ్యలో కేసులు నమోదుతుండగా, జిల్లాలోని ఆస్పత్రులు రద్దీగా మారుతున్నాయి. కంటి విభాగంలో వచ్చే ఓపీలో 20 శాతానికి పైగా కళ్ల కలక కేసులు ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఎన్నడూ లేనివిధంగా కళ్ల కలక కేసులు వెలుగు చూడటం వైద్య ఆరోగ్య శాఖ వర్గాలనే విస్మయానికి గురిచేస్తోంది. తగిన జాగ్రత్తలు పాటించాలని కంటి వైద్య నిపుణులు చెబుతున్నారు.

సంక్షేమ హస్టళ్లలో తీవ్రత

సంక్షేమ హస్టళ్లలోని విద్యార్థులు కళ్లకలతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రతీ హాస్టల్‌లో వందల సంఖ్యలో కేసులు వస్తున్నాయి. మందులు ఇస్తున్నా తగ్గడంలేదు. ఇన్‌ఫెక్షన్ వల్ల వస్తుందని, అశ్రద్ధ చేస్తే తీవ్రత పెరిగి కంటి సమస్యలు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. రోజూ 500 వరకు కేసులు నమోదవుతుండగా ప్రైవేట్ ఆస్పత్రి కేసులతో కలుపుకుంటే ఆ సంఖ్య మరింత ఎక్కువగానే ఉంటుంది.

జాగ్రత్తలు పాటించాలి..

కళ్ల కలక వస్తే సాధారణంగా కళ్ల చుట్టూ ఎరుపు, గులాబీ రంగుగా తయారై కళ్లలో నీరు, దురద, నొప్పి, వాపు వంటి లక్షణాలు కనిపిస్తాయి. నేత్రాల నుంచి అధికంగా స్రావం కారుతుంది. ఒక కంటితో ప్రారంభమై రెండో కంటికి సోకుతుంది. తేలికపాటి జ్వరంతో పాటు గొంతునొప్పి ఉండటం దీని లక్షణాలు. వ్యాధి సోకిన వారు ఆందోళన చెందకుండా పరిశుభ్రత పాటించాలని కంటి వైద్య నిపుణులు సూచిస్తున్నారు. దగ్గరలోని కంటి వైద్యుడిని సంప్రదించాలని పేర్కొంటున్నారు. కళ్ల కలక సోకిన వ్యక్తులు వాడిన వస్తువులను ఇతరులు వాడొద్దని, తరచూ చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని, నల్ల కళ్లద్దాలను వాడాలని సూచిస్తున్నారు.

వైద్యశిబిరాలు ఏర్పాటుచేస్తున్నాం



కళ్ల కలక ప్రభావం ఉన్న విద్యాసంస్థల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఐడ్రాప్స్ సిద్ధంగా ఉన్నాయి. కంటి వైద్య నిపుణుల ద్వారా వైద్యసేవలు అందిస్తున్నాం. కళ్ల కలక సాధారణంగా ఇన్‌ఫెక్షన్ వల్లే వస్తుంది. ఆందోళన చెందకుండా వైద్యుడిని సంప్రదించాలి.

–డాక్టర్ బి.మాలతి, డీఎంహెచ్ఓ

వారం లోపు తగ్గిపోతుంది



కళ్ల కలక ఒకరి నుంచి మరొకరికి సోకుతుంది. వ్యాధి సోకిన వారు చికిత్స తీసుకుంటే వారంలోగా నయమవుతుంది. అడెనో వైరస్ వల్ల ఈ కలక ఇబ్బందికి గురిచేస్తుంది. దృష్టికి హాని లేకపోయినా జాగ్రత్తలు తప్పనిసరి. మారుతున్న వాతావరణం, వైరస్, బ్యాక్టీరియాలతో వ్యాపిస్తుంది.

–డాక్టర్ శ్రీధర్‌గౌడ్, ఖమ్మం జనరల్ ఆస్పత్రి

వీడని జంట హత్యల మిస్టరీ..

- తల్లీకొడుకును హత్య చేసిందెవరు?
- మృతురాలి మెడలో గొలుసు, నగదు చోరీ
- వివిధ కోణాల్లో సాగుతున్న పోలీసు విచారణ


ఇంట్లో వస్తువులను పరిశీలిస్తున్న పోలీసులు

సత్తుపల్లి: వృద్ధురాలు, దివ్యాంగుడైన ఆమె కుమారుడిని అతికిరాతకంగా హత్య చేయగా.. మిస్టరీ ఇంకా వీడలేదు. హత్యోదంతం నుంచి మండలంలోని నారాయణపురం వాసులు కోలుకోలేదు. ఎవరిని కదిలించినా ఈ ఘటనపై ఆరా తీస్తుండటం కనిపించింది. వృద్ధురాలైన మృతురాలు రాయల తులశమ్మ, తన కుమారుడు దివ్యాంగుడైన సత్యనారాయణతో కలిసి నివసిస్తోంది. అయితే, వీరిద్దరినీ సోమవారం అర్ధరాత్రి గొంతు కోసి హత్య చేయగా, మంగళవారం విషయం వెలుగుచూసిన విషయం విదితమే. కాగా, పోలీసులు వివిధ కోణాల్లో విచారణ చేపట్టి అనుమానితుల కదలికలపై ఆరా తీస్తున్నారు.

సత్తుపల్లి నుంచి ఆటోలో వచ్చి..

తులశమ్మ తన కుమారుడైన సత్యనారాయణ(చంటి)తో కలిసి సోమవారం సత్తుపల్లి బ్యాంక్‌లో రూ.21 వేలు నగదు డ్రా చేసినట్టు తెలిసింది. సత్తుపల్లిలోనే బియ్యం, సరుకులు కొనుగోలు చేసి ప్రత్యేకంగా ఆటో మాట్లాడుకుని గ్రామానికి వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. సాయంత్రం పెద్దకోడలు చిట్టెమ్మను పిలిచి రూ.11,500 ఇచ్చినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. రాత్రి పొద్దుపోయే వరకు ఇంటి పరిసరాల్లో కనిపించిన ఆమె బంధువులతో ఫోన్‌లో కూడా మాట్లాడినట్టు సమాచారం.

ఒక్కరితోనే సాధ్యం కాదు..

హత్య జరిగిన తీరు, పరిసరాలను పరిశీలిస్తే జంట హత్యలు చేసింది ఒకరు కాదని.. మరికొందరి సహకారం ఉండొచ్చనే అనమానాలు వ్యక్తమవుతున్నాయి. తులశమ్మ ఎన్ని డబ్బులైనా తనతోనే ఉంచుకుంటుందే తప్ప ఇంట్లో కూడా భద్రపర్చదని స్థానికులు చెబుతున్నారు. కాగా, హత్య జరిగాక ఆమె వద్ద డబ్బు, మెడలోని బంగారం నాన్‌తాడు కనిపించకపోవటంతో వీటికోసం హత్యలు జరిగినట్లు భావిస్తున్నారు. ఇంట్లోని బీరువా కూడా తెరవకపోవడం ఈ అనుమానాలకు తావిస్తోంది. కాగా, ఘటన సమయంలో ఆమె పెనుగులాడినట్లు ఇంట్లోని వస్తువులు, గాజులు కింద పడగాన్ని చూస్తే అర్థమవుతోంది. అంతేకాక మృతులిద్దరి చేతుల వేళ్లు కోసుకుని ఉండడాన్ని పోలీసులు గుర్తించారు. ఈ మేరకు హత్యాస్థలంలో కాళ్లు, వేలి ముద్రలను సేకరించి దర్యాప్తు ముమ్మరం చేశారు.

పలు కోణాల్లో విచారణ

జంట హత్యలు పోలీసులకు సవాల్‌గా మారగా.. డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీంతో క్షణ్ణంగా పరిశీలించి ఆధారాలను సేకరించారు. బుధవారం కూడా పోలీసులు మృతురాలి ఇల్లు, పరిసరాలతో పాటు గ్రామంలోని పలు చోట్ల ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను సేకరించిన పోలీసులు పరిశీలించారు. ఏ చిన్న ఆధారాన్ని కూడా వదిలిపెట్టకుండా విచారణ చేస్తున్నారు. కుటుంబ సభ్యులను, అనుమానితుల కదలికలపై ఆరా తీస్తుండగా తులశమ్మ, ఆమె కుమారుడిని సత్తుపల్లి నుంచి తీసుకొచ్చిన వాహనదారులపై కూడా దృష్టి సారించినట్లు సమాచారం. కల్లూరు ఏసీపీ బి.రామానుజం పర్యవేక్షణలో పట్టణ సీఐ మోహన్‌బాబు కేసు దర్యాప్తు సాగుతుండగా ఒకటి, రెండు రోజుల్లో విచారణ ఓ కొలిక్కి వస్తుందని తెలిసింది.

బాండ్ పేపర్‌పై హామీలు.. గెలిపిస్తే అమలు

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మానవతారాయ్



సమావేశంలో మాట్లాడుతున్న మానవతారాయ్

సత్తుపల్లిటౌన్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తానంటూ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోటూరి మానవతారాయ్ రూ.100 బాండ్ పేపర్‌పై రాశారు. ఈ మేరకు సత్తుపల్లిలో బుధవారం ఆయన మాట్లాడారు. సత్తుపల్లి ప్రజల చిరకాల వాంఛ అయిన జిల్లా ఏర్పాటుతో పాటు థర్మల్ పవర్ స్టేషన్‌ను ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పిస్తామని, అన్యాక్రాంతమైన ప్రభుత్వ స్థలాలను గుర్తించి నిరుపేదలకు పంపిణీ చేస్తామనే మూడు హామీలు ఇస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు రావి నాగేశ్వరరావు, గాదిరెడ్డి సుబ్బారెడ్డి, రామిశెట్టి సుబ్బారావు, గంగిశెట్టి ప్రసాద్, సత్యనారాయణరెడ్డి, ఐ.కృష్ణ, ప్రసాద్, బాజీ, చారి వెంకటేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపనకు హాజరుకండి


సత్యనారాయణకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న రైల్వే అధికారులు

ఖమ్మంమామిళ్లగూడెం: అమృత్ భారత్ పథకం ద్వారా ఖమ్మం, మధిర రైల్వేస్టేషన్లలో అభివృద్ధి పనులకు రూ.25.4 కోట్ల చొప్పున కేటాయించారు. ఈ మేరకు 6వ తేదీన ప్రధానమంత్రి మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేయనుండడంతో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా, ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కోరుతూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణకు ఖమ్మం రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జాఫర్, కమర్షియల్ బుకింగ్ ఆఫీసర్ శ్రీనివాస్ బుధవారం ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ అమృత్ పథకంలో ఖమ్మం, మధిర స్టేషన్లకు చోటు దక్కడం ఆనందంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో రైల్వే అధికారులు నాగిరెడ్డి, ఫణికుమార్, బీజేపీ నాయకులు నున్నా రవికుమార్, అల్లిక అంజయ్య, నల్లగట్టు ప్రవీణ్, దుద్దుకూరి కార్తీక్, దీకొండ శ్యాం పాల్గొన్నారు. కాగా, అమృత్ పథకం కింద జిల్లాలోని స్టేషన్లను ఎంపిక చేయడంతో ప్రధాని మోదీ, రైల్వే శాఖ మంత్రి అశ్విన్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

గల్లంతైన రైతు కోసం గాలింపు


మున్నేరులో గాలిస్తున్న గ్రామస్తులు

ముదిగొండ: మండలంలోని గంధసిరి వద్ద మున్నేరులో మంగళవారం సాయంత్రం రైతు చమట కొండల్‌రావు ప్రమాదవశాత్తు గల్లంతు కాగా ఇప్పటి వరకు ఆచూకీ తెలియరాలేదు. గ్రామస్తులు 20 మందికి పైగా మంగళవారం రాత్రి వరకు గాలించినా ఫలితం లేకపోవడంతో బుధవారం తెల్లవారుజాము నుంచి గంధసిరి, చిన్నమండవ రేవు, పెద్దమండవ లంక, పోలంపల్లి కత్తువ వరకు ముమ్మరంగా వెతుకున్నారు. ఖమ్మం రూరల్ సీఐ రాజిరెడ్డి, ఎస్‌ఐ నరేశ్ పరిశీలించి వివరాలు ఆరా తీశారు.

మల్లన్నపాలెంలో చోరీ

ముదిగొండ: మండలంలోని మల్లన్నపాలెంలో జరిగిన చోరీ ఘటనపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మల్లన్నపాలేనికి చెందిన నక్క ఉపేందర్ కుటుంబంతో కలిసి మంగళవారం రాత్రి ఇంటి డాబాపై నిద్రించాడు. తెల్లవారుజామున లేచేసరికి రెండు సెల్‌ఫోన్లు, రూ.వెయ్యి నగదు చోరీకి గురయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కమలాపురానికి చెందిన సీహెచ్ వీరబాబు, ఎం.గోపి చోరీ చేసినట్లు తేలడంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- మరొకరి పరిస్థితి విషమం
- రాత్రంగా చెట్ల పొదల్లోనే ఉన్న ఇరువురు


హరి (ఫైల్)

కూసుమంచి: మండలంలోని మల్లేపల్లి సమీపాన జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా మరో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని గంగబండతండాకు చెందిన వడిత్య హరి, వడిత్య మల్సూర్ మంగళవారం మధ్యాహ్నం ద్విచక్రవాహనంపై నేలకొండపల్లికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో తల్లిదండ్రులు ఫోన్ చేసినా స్పందించలేదు. అయితే, బుధవారం ఉదయం మల్లేపల్లికి చెందిన మేకల కాపరి పొలానికి వెళ్తుండగా రోడ్డు పక్కన పొదల్లో ద్విచక్ర వాహనం, ఇద్దరు యువకులు పడిపోయి కనిపించారు. ఆయన ఇచ్చిన సమాచారంతో గ్రామస్తులు చేరుకుని వడిత్య హరి, మల్సూర్‌గా గుర్తించారు. అయితే, అప్పటికే హరి (16) మృతి చెందగా మల్సూర్ కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాడు. కాగా, మంగళవారం రాత్రి ఈ ప్రమాదం జరగగా, చెట్ల పొదల్లో పడిపోవడంతో ఎవరూ గుర్తించలేకపోయారు. మృతుడు హరి డిగ్రీ చదువుతుండగా మల్సూర్‌కు రెండు నెలల కిందటే వివాహమైంది. ఈఘటనతో గంగబండాతండాలో విషాదం నెలకొంది. కాగా, మండలంలోని మల్లేపల్లి వద్ద బుధవారం ద్విచక్ర వాహనం పైనుంచి కింద పడడంతో చౌటపల్లికి చెందిన ఇద్దరు, అగ్రహారం వద్ద జరిగిన ఇంకో ప్రమాదంలో తల్లీ కుమారుడు గాయపడ్డారు.

బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్తూ..

- రోడ్డు ప్రమాదంలో నవవధువు మృతి
- భర్త, అత్తామామలకు తీవ్రగాయాలు
- ముత్తగూడెం, ఉల్వనూరు గ్రామాల్లో విషాదం


ఘటనా స్థలంలో చెల్లాచెదురుగా పడి ఉన్న నిత్యావసరాలు

పాల్వంచరూరల్: రెండు నెలల క్రితం వివాహమైంది. బతుకుదెరువు కోసం భాగ్యనగరం వెళ్తున్నారు. ఈ క్రమంలో కారు చెట్టును ఢీకొని నవ వధువు మృతి చెందింది. భర్త, అత్త, మామలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం కుందారం సమీపంలో బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పాల్వంచ మండలం ఉల్వనూరు గ్రామానికి చెందిన అంబడి ప్రశాంత్‌కు ఖమ్మం రూరల్ మండలం ముత్తగూడెం గ్రామానికి చెందిన సింధూజ(23)తో గత జూన్ 8న వివాహం జరిగింది. కారు నడుపుతూ జీవనం సాగిస్తున్న ప్రశాంత్ బతుకుదెరువు కోసం హైదరాబాద్ వెళ్లి క్యాబ్ నడుపుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఇటీవల భార్యతోపాటు తల్లిదండ్రులు శ్రీనివాస్, నాగమణి తీసుకుని హైదరాబాద్‌కు వెళ్లి, అద్దెకు ఇల్లు తీసుకుని వచ్చాడు. మంగళవారం రాత్రి ఉల్వనూరులో ఇంటికి తాళంవేసి నలుగురూ కారులో హైదరాబాద్‌కు బయల్దేరారు. ఈ క్రమంలో జనగామ జిల్లా పాలకుర్తిరోడ్‌లోని కుందారం సమీపంలో కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. దీంతో సింధూజ తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. ప్రశాంత్, అతని తల్లిదండ్రులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను జనగామ ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

వివాహమై రెండు నెలలు కాకముందే..


భర్తతో మృతురాలు సింధూజ (ఫైల్)

ప్రశాంత్, సింధూజకు వివాహం జరిగి రెండు నెలలు కూడా పూర్తిగా నిండలేదు. ఇక్కడ బతుకుదెరువు లేకపోడంతో హైదరాబాద్ వెళ్లి కారు క్యాబ్ నడుపుకునేందుకు కుటుంబం అంతా బయల్దేరారు. అవసరమైన నిత్యావసర వస్తువులు బియ్యం, ఉప్పు, కారం, పచ్చళ్లు, కుట్టు మిషన్ వంటి సామగ్రి వెంట తీసుకెళ్తున్నారు. ప్రమాదస్థలిలో నిత్యావసర వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడిఉన్న తీరు చూసి పలువురు కన్నీటి పర్యంతమయ్యారు. వివాహం జరిగిన రెండు నెలలు కాకముందే సింధూజ మృతిచెందడంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు. ఉల్వనూరు, ముత్తగూడెం గ్రామాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

వ్యక్తి పైనుంచి దూసుకెళ్లిన ట్రాక్టర్

ఎర్రుపాలెం: మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్‌లో బుధవారం ఉదయం ట్రాక్టర్ అదుపుతప్పి ఓ వ్యక్తి పైనుంచి దూసుకెళ్లింది. ఈ ఘటనలో సదరు వ్యక్తికి ప్రాణాపాయం తప్పగా తీవ్రగాయాలతో బయటపడ్డాడు. ఏపీ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా పెద్దాపురానికి చెందిన రైతు కృష్ణారెడ్డి ట్రాక్టర్‌లో డీజిల్ పోయించుకునేందుకు వచ్చాడు. ఇంజన్‌ను ఆపకుండానే ఆయన కిందకు దిగడంతో ట్రాక్టర్ కదిలి ఆయన పైనుంచి వెళ్లింది. అయితే, కృష్ణారెడ్డి చాకచక్యంగా వ్యవహరించి ప్రాణాలను కాపాడుకున్నాడు. ట్రాక్టర్‌ను బంక్ సిబ్బంది అదుపు చేశారు.

జిల్లా కోర్టుకు హాజరుకండి..

– ఖమ్మం వైద్యుడికి నోటీసులు జారీ

కొత్తగూడెంటౌన్: సాక్ష్యాలు సమర్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యుడిని కోర్టులో హాజరుకావాలని ఆదేశిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జడ్జి పాటిల్ వసంత్ బుధవారం నోటీసులు జారీ చేశారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. ఏన్కూరు మండలం తూతకలింగన్నపేటకు చెందిన ఆల్ల లక్ష్మి 2021, మార్చి 21న వాహన ప్రమాదంలో గాయపడి ఖమ్మంలోని సురక్ష హాస్పిటల్‌లో చికిత్స చేయించుకుంది. ఆ తర్వాత నష్టపరిహారం కోసం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కేసు వేసింది. అయితే, కేసు విచారణలో వైద్యుడి సాక్ష్యం అవసరం కావడంతో కోర్టు అడ్వకేట్ కమిషనర్‌ను నియమించింది. ఈమేరకు కమిషనర్‌గా నియమితులైన ఉప్పు అరుణ సురక్ష ఆస్పత్రి మేనేజర్ సైదులుకు సమాచారం ఇచ్చి ఆయన సూచనతో గతనెల 17న ఆస్పత్రికి వెళ్లగా.. దూషించారని, మళ్లీ 3గంటలకు వచ్చి మాట్లాడి వెళ్లిపోవడంతోపాటు సాయంత్రం వస్తానని చెప్పినా సాక్ష్యం పూర్తిగా ఇవ్వలేదని ఆమె కోర్టుకు నివేదిక ఇచ్చారు. దీంతో విచారణకు సహకరించలేదని భావిస్తూ వైద్యుడిని ఈనెల 17వ తేదీన స్వయంగా కోర్టులో హాజరుకావాలని ఆదేశిస్తూ జడ్జి నోటీసు జారీ చేశారు.

కోళ్లు కావాలంటూ గొలుసు లాక్కెళ్లారు..

కొణిజర్ల: రోడ్డు పక్కన నిలబడి ఉన్న వృద్ధురాలి మెడలో బంగారు గొలుసును ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు లాక్కెళ్లారు. మండలంలోని తీగలబంజరలో బుధవారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన ముగితాల మేరమ్మ తన ఇంటి ముందు నిలబడి ఉండగా ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరిలో ఒకరు కిందకు దిగి నాటుకోళ్లు ఉన్నాయా అని ఆరా తీశారు. ఆమె లేవని చెబుతుండగానే మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసు లాక్కుని ఏన్కూరు వైపు పరారయ్యారు. ఘటనపై మేరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ శంకర్‌రావు తెలిపారు.

చోరీకి యత్నం

ఏన్కూరు: మహిళ మెడలోని గొలుసు చోరీ చేసేందుకు యత్నించిన ఘటన మండలంలోని తూతకలింగన్నపేటలో జరిగింది. గ్రామానికి చెందిన ఈవూరి హైమావతి మంగళవారం రాత్రి తన కిరాణా షాపులో ఉండగా గుర్తు తెలియని వ్యక్తి పల్సర్ బైకుపై వచ్చి వాటర్‌బాటిల్ అడిగాడు. ఆమె ఇస్తుండగానే మహిళ మెడలోని బంగారు గొలుసు లాగుతుండగా హైమావతి కేకలు వేయడంతో తెగిన గొలుసు అక్కడే వదిలేసి పరారయ్యారు. బాధితురాలు బుధవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని ఎస్‌ఐ బాదావత్ రవి తెలిపారు.

దాడికి యత్నించిన 14 మందిపై కేసు

కారేపల్లి: కారం చల్లి దాడికి యత్నించడమే కాక పొలం మడులను ధ్వంసం చేసిన 14 మందిపై కారేపల్లి పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. మండలంలోని భాగ్యనగర్‌తండాకు చెందిన ఇస్లావత్ తారాచంద్ 2003లో సాదాబైనామా ద్వారా 4.28 ఎకరాలను సూర్యతండాకు చెందిన బానోతు హుస్సేన్ వద్ద కొనుగోలు చేశాడు. అప్పటి నుంచి వరి సాగు చేస్తుండగా, సూర్యతండాకే చెందిన బానోతు హుస్సేన్, గుగులోతు సోమ్లాతో పాటు మరో 12 మంది బుధవారం పొలం వద్దకు వచ్చి తమ పొలాన్ని ఎవరికీ అమ్మలేదని చెబుతూ పొలం మడులు ధ్వంసం చేశారు. అడ్డుకోబోయిన తారాచంద్ కుటుంబంపై కారం చల్లి దాడికి యత్నించగా వారు భయంతో కారేపల్లి పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. ఘటనపై బాధితులు చేసిన ఫిర్యాదుతో 14 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పి.రామారావు తెలిపారు.

వృద్ధురాలిపై కోతుల దాడి

వైరారూరల్: కోతుల దాడిలో ఓ వృద్ధురాలికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని నారపునేనిపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన శీలం సరోజిని ఇంటి వాకిట్లో పని చేస్తుండగానే ఒక్కసారిగా వచ్చిన కోతులు ఆమెపై దాడి చేయగా గాయాలయ్యాయి. ఈ విషయాన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు కోతులను అదిలించి ఆమెకు చికిత్స చేయించారు. కాగా, గ్రామంలో కొద్దిరోజుల నుంచి కోతులు పలువురిని గాయపరుస్తున్నా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ సరోజిని కుమారుడు శీలం వెంకటరెడ్డి పంచాయతీ కార్యదర్శిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

క్లుప్తంగా...

చెరువుల నుంచి మట్టి తవ్వకం అక్రమమే

ఉద్దండాపూర్‌పై పిటిషన్‌లో ఎన్జీటీ ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్‌: పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టులో భాగమైన ఉద్దండాపూర్ రిజర్వాయర్ కట్ట నిర్మాణం కోసం చెరువుల్లోని మట్టిని పెద్దఎత్తున తవ్వి తరలించడం అక్రమేనని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) తేల్చింది. అది పర్యావరణ చట్టాలకు విరుద్ధమని పేర్కొంది. తవ్విన మట్టిని అంచనా వేసి జరిమానాను లెక్కించాలని రాష్ట్ర గనులు, భూగర్భ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌ను ఆదేశించింది. ఈ జరిమానాను కృష్ణా నదీ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ)కి చెల్లించాల్సి ఉంటుందని చెప్పింది. దీని కోసం 4 వారాలు గడువిస్తున్నట్లు పేర్కొంది. పాలమూరు, రంగారెడ్డి లిఫ్ట్ స్కీమ్‌లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మహబూబ్‌నగర్ జిల్లాలో ఉద్దండాపూర్ రిజర్వాయర్ నిర్మిస్తున్న విషయం తెలిసిందే. అయితే అత్యంత పొడవైన ఈ రిజర్వాయర్ నిర్మాణానికి పర్యావరణ అనుమతి లేకున్నా చుట్టు పక్కల ఉన్న చెరువుల నుంచి విచక్షణా రహితంగా మట్టిని తవ్వి కట్ట నిర్మాణానికి తరలిస్తున్నారు. ఇది చట్టవిరుద్ధమని పేర్కొంటూ మహబూబ్‌నగర్ జిల్లా ముదిరెడ్డిపల్లెకు చెందిన కోస్గీ వెంకటయ్య ఎన్జీటీలో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జ్యుడీషియల్ సభ్యులు జస్టిస్ పుష్ప సత్యనారాయణ, ఎక్స్‌పర్ట్ సభ్యులు సత్యగోపాల్ కొర్లపాటి బెంచ్ విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపున సుప్రీంకోర్టు న్యాయవాది శ్రవణ్ కుమార్ వాదనలు వినిపించారు. 'మట్టిని విచక్షణారహితంగా తవ్వితే చెరువుల నీటి నిల్వ సామర్థ్యం దెబ్బతింటుంది. భూగర్భ జలాలు ప్రతికూలంగా ప్రభావం చూపే అవకాశం ఉంది. వర్షపు నీరు పూర్తిగా ఖాళీ అయిన తర్వాత భూగర్భ జలాలు మరింత కిందకు పడిపోతాయి. ఆ మట్టిని అనుమతి లేకుండా కట్ట నిర్మాణానికి ఉపయోగించడం చట్టవిరుద్ధం. వెంటనే తవ్వకాలను ఆపేలా ఆదేశాలు ఇవ్వాలి' అని వాదించారు. వాదనలు పూర్తి కావడంతో జస్టిస్ పుష్ప తీర్పు వెల్లడించారు.

ఏపీ బీసీ యూత్ అసోసియేషన్ కార్యదర్శిగా శివకుమార్

లక్డీకాపూల్ (హైదరాబాద్): తిరుపతి జిల్లా రేణిగుంటకు చెందిన పి.శివకుమార్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ యూత్ అసోసియేషన్ కార్యదర్శిగా నియమితులయ్యారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య ఆదేశాల మేరకు ఈ నియామకాన్ని చేపట్టినట్లు ఆంధ్రప్రదేశ్ యూత్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.లక్ష్మీనారాయణ (నాని ముదిరాజ్) తెలిపారు.

మేం చెప్పిందే చట్టం!

ప్రభుత్వం తమదంటూ అధికారులను బెదిరించిన 'నారాయణ'

- బినామీలు, బంధువుల పేరిట భారీగా అసైన్డ్ భూములు కాజేశారు
- బినామీల పేరిట కొన్న 148 ఎకరాల ప్రస్తుత మార్కెట్ విలువ రూ.600 కోట్లకుపైనే
- నారాయణ, ఆయన కుమార్తె ఫోన్ సంభాషణల్లో ఈ వ్యవహారం బయటపడింది
- చంద్రబాబుకు సైతం భాగస్వామ్యం.. ఆధారాలున్నాయి.. లోతైన దర్యాప్తు అవసరం
- స్టే ఎత్తివేసి దర్యాప్తునకు అనుమతివ్వండి.. హైకోర్టుకు నివేదించిన ఏఏజీ పొన్నవోలు

సాక్షి, అమరావతి: ఏపీ రాజధాని అమరావతిలో నిరుపేద అసైన్డ్‌దారులను బెదిరించి బినామీలు, బంధువుల పేరిట కారుచౌకగా భూములను కొట్టేసిన మాజీ మంత్రి పొంగూరు నారాయణ అధికారులను సైతం బెదిరించారని సీఐడీ తరపున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్ రెడ్డి హైకోర్టుకు బుధవారం నివేదించారు. ప్రభుత్వం తమదని, తాము చెప్పిందే చట్టమని, చెప్పినట్లు చేయాలంటూ అధికారులను భయభ్రాంతులకు గురి చేశారన్నారు. అప్పటి అడ్వొకేట్ జనరల్ (ఏజీ), న్యాయశాఖ, ముఖ్య కార్యదర్శులు, ఐఏఎస్ అధికారులు వారించినా నారాయణ లెక్క చేయలేదని తెలిపారు. అసైన్డ్ భూముల కొనుగోళ్ల వ్యవహారంలో నారాయణే కీలక సూత్రధారి అని స్పష్టం చేశారు. ఆయన సమీప బంధువులు, బినామీల పేరిట 148 ఎకరాలను కొనుగోలు చేసేందుకు రూ.18.10 కోట్లు వెచ్చించినట్లు నివేదించారు. ప్రస్తుతం వాటి మార్కెట్ విలువ రూ.600 కోట్లకు పైనే ఉంటుందని కోర్టు దృష్టికి తెచ్చారు. అసైన్డ్ భూములను ప్రభుత్వం వెనక్కి తీసుకుంటుందని, అంతిమంగా పేదలకు ఎలాంటి లబ్ధి చేకూరదంటూ గత ప్రభుత్వ పెద్దలు, అధికార పార్టీ నేతలు భయాందోళనలు రేకెత్తించారన్నారు. అనంతరం అసైన్డ్‌దారుల నుంచి భూములను అన్ రిజిస్టర్డ్ సేల్ అగ్రిమెంట్ల ద్వారా నామమాత్రపు ధరలకు కొట్టేశారని వివరించారు. ఆ తరువాత వాటిని ల్యాండ్ పూలింగ్ స్కీం కింద సీఆర్‌డీఏకు ఇచ్చి జీవో 41 (ల్యాండ్ పూలింగ్ స్కీం రూల్స్)ని అడ్డం పెట్టుకుని విలువైన నివాస, వాణిజ్య ప్లాట్లను పొందినట్లు తెలిపారు. కొన్నిటిని అధిక ధరలకు అమ్ము



కున్నట్లు కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ మొత్తం నేరంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నాటి పురపాలక శాఖ మంత్రి నారాయణ పాత్రపై స్పష్టమైన ఆధారాలున్నాయని నివేదించారు. దర్యాప్తులో భాగంగా సీఐడీ అధికారులు స్వాధీనం చేసుకున్న నారాయణ ఫోన్‌లో ఆయన కుమార్తె సింధూరతో జరిపిన కీలక సంభాషణలున్నట్లు తెలిపారు. తాను అసైన్డ్ భూములను కొన్నట్లు ఆ సంభాషణల్లో నారాయణ అంగీకరించారని వెల్లడించారు. అసైన్డ్ భూములు తమ పేర్లతో ఉంటే ప్రభుత్వం జైల్లో వేస్తుందని నారాయణ తన కుమార్తెతో చెప్పారన్నారు. ఆ సంభాషణల తాలుకూ పెన్ డ్రైవ్‌ను సీల్డ్ కవర్‌లో కోర్టుకు అందచేశారు. ఈ మొత్తం వ్యవహారానికి సంబంధించి ఒరిజినల్ రికార్డులను సైతం సీల్డ్ కవర్‌లో కోర్టుకు సమర్పించారు. సుధాకర్‌రెడ్డి వాదనలు పూర్తి కాకపోవడంతో తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్ ఉత్తర్వులు జారీ చేశారు. అసైన్డ్ భూముల బదలాయింపులో అక్రమాలపై మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఫిర్యాదు ఆధారంగా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, మాజీ మంత్రి పొంగూరు నారాయణలపై సీఐడీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. దీన్ని కొట్టివేయాలని కోరుతూ వేర్వేరుగా దాఖలైన క్వాష్ పిటిషన్లపై స్టే విధించిన న్యాయస్థానం ఇటీవల తుది విచారణ చేపట్టింది.

ఇతర టీడీపీ నేతలు కూడా..

అసైన్డ్‌దారులను బెదిరించి కేవలం నారాయణ మాత్రమే కాకుండా అప్పటి అధికార పార్టీ నేతలైన రావెల కిషోర్‌బాబు, అనగాని సత్యప్రసాద్, పరిటాల శ్రీరామ్, ప్రత్తిపాటి పుల్లారావు తదితరులు కూడా భూములను సొంతం చేసుకున్నట్లు ఏఏజీ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ల్యాండ్ పూలింగ్ పరిధిలోకి అసైన్డ్ భూములను తీసుకురావడం, ఆ భూముల బదలాయింపుపై అప్పటి గుంటూరు జిల్లా కలెక్టర్ కాంతీలాల్ దండే, జాయింట్ కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అభ్యంతరం తెలిపారన్నారు. ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్ సైతం అభ్యంతరం వ్యక్తం చేశారన్నారు. అసైన్డ్ భూముల విషయంలో చట్టపరమైన నిబంధనలను నారాయణకు స్పష్టంగా వివరించినట్లు వారు తమ వాంగ్మూలాల్లో స్పష్టంగా చెప్పారన్నారు. ఈ నేపథ్యంలో స్టే ఎత్తివేసి సీఐడీ దర్యాప్తు కొనసాగించేందుకు అనుమతినివ్వాలని అభ్యర్థించారు.

చట్టపరమైన రక్షణ ఉంది.. ప్రాసిక్యూషన్ తగదు

అంతకు ముందు నారాయణ తరపున సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ సీఆర్‌డీఏ చట్టం కింద తీసుకున్న నిర్ణయాల విషయంలో ప్రభుత్వం, అధికారులు, అథారిటీలకు వ్యతిరేకంగా ఎలాంటి కేసులు దాఖలు చేయడానికి వీల్లేదన్నారు. చట్టం కింద రక్షణ ఉన్నందున నారాయణను ప్రాసిక్యూట్ చేయడానికి వీల్లేదన్నారు. తమకున్న అధికారం మేరకే జీవో 41 జారీ చేశారని తెలిపారు. ఈ అధికారాన్ని ప్రశ్నించడానికి వీల్లేదన్నారు. విధానపరమైన నిర్ణయాలు తీసుకునే వారికి దురుద్దేశాలు అంటగట్టడానికి వీల్లేదన్నారు. అసైన్డ్ భూముల విషయంలో ఎస్సీ, ఎస్టీలెవరూ ఫిర్యాదుదారులు కాదన్నారు. అందువల్ల ఆ చట్టం కింద కేసు నమోదు చేయడానికి వీల్లేదన్నారు.

82.92 లక్షల ఎకరాల్లో పంటల సాగు

అందులో 43.25 లక్షల ఎకరాల్లో పత్తి

- 25.52 లక్షల ఎకరాల్లో వరి నాట్లు
- ప్రభుత్వానికి వ్యవసాయశాఖ నివేదిక

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలో పంటల సాగు ఊపందుకుంది. భారీ వర్షాలు కురవడంతో ఒకవైపు పంట నష్టం జరిగినా, మరోవైపు రైతులు వరి నాట్లు వేసుకోవడంలో నిమగ్నమయ్యారు. రాష్ట్రంలో వానాకాలం సీజన్‌లో 82.92 లక్షల ఎకరాల్లో పంటలు సాగైనట్లు వ్యవసాయశాఖ బుధవారం రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసిన నివేదికలో వెల్లడించింది. ఈ సీజన్ సాధారణ సాగు విస్తీర్ణం 1.24 కోట్ల ఎకరాలు కాగా, 66.72% విస్తీర్ణంలో పంటలు సాగయ్యాయి. పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 50.59 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 43.25 లక్షల ఎకరాల్లో సాగైంది. వరి సాధారణ సాగు విస్తీర్ణం 49.86 లక్షల ఎకరాలు ఉండగా ఇప్పటివరకు 25.52 లక్షల ఎకరాల్లో నాట్లు పడ్డాయి. పప్పు ధాన్యాల సాధారణ సాగు విస్తీర్ణం 9.43 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 4.80 లక్షల ఎకరాల్లో, సోయాబీన్ సాధారణ సాగు విస్తీర్ణం 4.13 లక్షల ఎకరాలు ఉండగా ఇప్పటివరకు 4.26 లక్షల ఎకరాల్లో సాగైంది. ఇక మొక్కజొన్న సాధారణ సాగు విస్తీర్ణం 7.13 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 4.51 లక్షల ఎకరాల్లో సాగైంది.

భారీ స్కామ్.. 'బ్రో'

- అమెరికాలో బాబు ముఠా వసూలు చేసిన డబ్బునే పవన్‌కు ప్యాకేజీగా ఇప్పించారు: అంబటి
- చాలా ముఖ్యమైన అంశంపై ఢిల్లీ వెళ్తున్నట్లు అంబటి వెల్లడి

సాక్షి, అమరావతి: బ్రో సినిమా వ్యవహారంలో నూటికి నూరు శాతం అక్రమ ఆర్థిక లావాదేవీలు జరిగాయని, అదో కుంభకోణమని ఏపీ జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పునరుద్ఘాటించారు. తన ఆరోపణల్లో వాస్తవాలు లేకపోతే సినిమా నిర్మాతగానీ పవన్ కల్యాణ్‌గానీ ఎందుకు ఖండించడం లేదని ప్రశ్నించారు. వాస్తవాలు వెల్లడించేందుకు భయపడుతున్నారా? దాస్తున్నారా? అని నిలదీశారు. దాస్తున్నారంటే అందులో స్కామ్ దాగి ఉందనే అర్థమని స్పష్టం చేశారు. విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి అంబటి బుధవారం మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు అమెరికాలో తన ముఠా ద్వారా వసూలు చేసిన డబ్బును నిర్మాత టీజీ విశ్వప్రసాద్ ద్వారా పవన్‌కు ప్యాకేజీగా ఇప్పించారని పునరుద్ఘాటించారు.



డైలాగ్‌లు కొట్టి దాగుడు మూతలెందుకు?

బ్రో సినిమాకు విదేశీ పెట్టుబడులు అక్రమంగా వచ్చాయని, ఇది మనీలాండరింగ్ కాదా? అని అంబటి సూటిగా ప్రశ్నించారు. ఈ సినిమాకు పెట్టిన పెట్టుబడి ఎంత? కలెక్షన్లు ఎంత? పవన్ పారితోషికం ఎంత? ఆదాయ పన్నుగా కట్టింది ఎంత? అని ప్రశ్నించారు. అత్యంత నిజాయితీపరుడినని, అపర దాన కర్ణుడినని, సమాజ శ్రేయస్సు కోరుకునే వ్యక్తినంటూ డైలాగ్‌లు కొట్టే పవన్ వాస్తవాలను ఎందుకు దాస్తున్నారని నిలదీశారు. సినిమాను సినిమాలాగే చూడాలన్న సాయిధరమ్ తేజ్ వ్యాఖ్యలపై మంత్రి అంబటి స్పందిస్తూ అలాంటప్పుడు సినిమాలను సినిమాగానే తీయండి...మధ్యలో మమ్మల్ని గోకడమెందుకు? అని చురకలంటించారు. బ్రో సినిమా వ్యవహారంలో మనీలాండరింగ్ జరిగిందంటూ ఈడీ, సీబీఐకి ఫిర్యాదు చేసేందుకు ఢిల్లీ వెళ్తున్నారా? అని విలేకరులు ప్రశ్నించగా 'నేను ఇవాళ రాత్రి చాలా ముఖ్యమైన అంశంపై ఢిల్లీ వెళ్తున్నా. మా పార్టీ ఎంపీలను కలుస్తా. ఢిల్లీ నుంచి వచ్చాక అన్ని వివరాలు చెబుతా' అని అంబటి చెప్పారు.

వృద్ధాప్యంలోనూ అనుమానంతో వేధిస్తున్నాడని..

- భర్త హత్యకు భార్య సుపారీ
- రూ. రెండు లక్షలు తీసుకొని హతమార్చిన ఇద్దరు
- ఆలస్యంగా ఘటన వెలుగులోకి...

సిరిసిల్లక్రైం: వృద్ధాప్యంలోనూ కట్టుకున్న భార్యను అనుమానించాడు. భర్త పదేపదే కొట్టడంతో విసిగిపోయింది. ఎలాగైనా తన భర్తను హతమార్చాలని రూ.రెండు లక్షలకు సుపారీ ఇచ్చింది. గత నెల 13వ తేదీన హత్య జరగ్గా, బుధవారం ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. సిద్దిపేట జిల్లా చింతమడక గ్రామానికి చెందిన కనకవ్వ(60), కాశయ్య(65) బతుకుదెరువుకు సిరిసిల్లకు 25 ఏళ్ల క్రితం వచ్చారు. వీరికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు. కూతుళ్లకు పెళ్లిళ్లు జరగగా, కొడుకు మానసిక స్థితి సరిగ్గా లేదు. వృద్ధ దంపతులిద్దరూ సిరిసిల్ల మార్కెట్‌లో కూరగాయలు విక్రయిస్తారు. ఈ క్రమంలోనే భార్యపై భర్తకు అనుమానం కలిగింది. పలుమార్లు కనకవ్వను కొట్టాడు. ఆమె భర్త వేధింపులు తట్టుకోలేకపోయింది. వరుసకు తమ్ముడిగా పిలిచే ఒకరికి విషయాన్ని చెప్పింది. భర్తను చంపితే రూ.2లక్షలు ఇచ్చేందుకు ఒప్పందం చేసుకుంది. గత నెల 13న మద్యం మత్తులో కాశయ్య నిద్రిస్తుండగా, అనుకున్న పథకం ప్రకారం తను సంప్రదించిన వారికి సమాచారం ఇచ్చింది. వారు ఇంటికి చేరుకొని నిద్రలో ఉన్న కాశయ్య గొంతుకు దుప్పటి చుట్టి ఊపిరి ఆడకుండా చేసి చంపేశారు. మృతదేహాన్ని కారులో వేసుకొని సిరిసిల్లలోని మానేరు వాగు చెక్‌డ్యామ్ వద్ద బొందలగడ్డలో పూడ్చిపెట్టారు. ఆ తర్వాత రూ.2 లక్షలు తీసుకుని వెళ్లిపోయారు.



మృతదేహాన్ని వెలికితీస్తున్న అధికారులు. ఇన్‌సెట్లో కాశయ్య (ఫైల్)

డబ్బుల కోసం బ్లాక్‌మెయిల్

చంపడానికి చేసుకున్న ఒప్పందంతోపాటు హత్య చేసిన విధానాన్ని నిందితుల్లో ఒకరు వీడియో తీసినట్టు తెలిసింది. హత్య చేసిన తర్వాత వచ్చిన రూ.2లక్షలతో జల్సాలు చేసే సమయంలో మరో రూ.లక్ష కావాలంటూ కనకవ్వను డిమాండ్ చేశారు. డబ్బులు ఇవ్వకుంటే హత్యకు సంబంధించిన వీడియో బయటపెడతామని బెదిరించసాగారు. ఈ తతంగమంతా బయటకు పొక్కింది. దీనిపై సిరిసిల్లటౌన్ సీఐ ఉపేందర్ విచారణ చేపట్టారు. కూరగాయల మార్కెట్ ఏరియాలో నిఘా పెట్టి అనుమానితుల నుంచి సమాచారం సేకరించారు. చివరికి వృద్ధుడి హత్య చేయడానికి సుపారీ తీసుకున్న ఇద్దరు నిందితులతోపాటు మృతుని భార్యను అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం వెలుగుచూసింది. బొందలగడ్డలో పూడ్చిపెట్టిన మృతదేహాన్ని తహసీల్దార్ సమక్షంలో బయటకు తీయించారు. ఈ విషయంపై సిరిసిల్లటౌన్ సీఐ ఉపేందర్‌ను వివరణ కోరగా కేసు దర్యాప్తులో ఉందని, వివరాలు ఉన్నతాధికారుల సమక్షంలో వెల్లడిస్తామని తెలిపారు.

జిల్లా వార్తలు

రేపు సీపీఆర్ఎంఎస్-ఎన్ఈ సమావేశం

సింగరేణి(కొత్తగూడెం): కోలిండియా కాంట్రిబ్యూటరీ పోస్ట్ రిటైర్‌మెంట్ మెడికల్ స్కీమ్ (నాన్ ఎగ్జిక్యూటివ్) సీపీఆర్ఎంఎస్-ఎన్ఈ బోర్డ్ సమావేశం శుక్రవారం కోల్‌కతాలో జరగనుందని ఏబీకేఎంఎస్-బీఎంఎస్ జాతీయ కార్యదర్శి పి.మాధవ్‌నాయక్ తెలిపారు. సమావేశం నిర్వహించాలని కోలిండియా యాజమాన్యానికి లేఖ రాయడంతో తేదీ ఖరారు చేశారని చెప్పారు. సమావేశానికి బీఎంఎస్ తరపున తాను హాజరుకానుండగా, బొగ్గుగని కార్మికులకు ఉద్యోగ విరమణ తర్వాత వైద్యసౌకర్యం, బిల్లుల చెల్లింపునకు సంబంధించి ఎదురవుతున్న సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు.

అపరాల పంటలపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త రుక్మిణిదేవి

ఎర్రుపాలెం: అపరాల పంటలైన కంది, పెసర, మినుముపై రైతులు దృష్టి సారించాలని మధిర వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కె.రుక్మిణిదేవి సూచించారు. ఎర్రుపాలెం మండలం బుచ్చిరెడ్డిపాలెంలో బుధవారం అపరాల పంటల సాగులో నూతన సాంకేతిక విధానాలు, యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అపరాల పంటల సాగుతో కలిగే లాభాలను వివరించాక పలువురు రైతులు సాగు చేసిన పత్తి, వరి పంటలను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. శాస్త్రవేత్తలు డాక్టర్.భరత్, రూన్సీరాణి, కె.నాగస్వాతి, ఏఈఓ సుష్మ పాల్గొన్నారు.

సింగరేణి ఆస్పత్రిలో మణికట్టు ఆపరేషన్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి ప్రధానాస్పత్రిలో చేతి మణికట్టు ఆపరేషన్‌ను వైద్యులు విజయవంతంగా పూర్తిచేశారు. జేవీఆర్ ఓసీలో విధులు నిర్వర్తిస్తున్న భీమయ్య కుమారుడు అభిలాష్‌కు ఇటీవల జరిగిన ప్రమాదంలో పడి రెండు చేతుల మణికట్టు వద్ద ఎముకలు విరిగాయి. దీంతో సింగరేణి ఆస్పత్రిలో చేర్పించగా వైద్యులు ఆపరేషన్ చేయడంతో ఆయన కోలుకుంటున్నాడు. ఈ సందర్భంగా ఆర్థో సర్జన్ సువర్ణ, ఏసీఎంఓ సుజాతను టీబీజీకేఎస్ నాయకులు రజాక్, కూసన వీరభద్రయ్య, నిమ్మల రాజేశ్వరరావు, చిలక రాజయ్య, పోశం శ్రీనివాస్, అనిల్, భరత్, సాగర్ కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

సేవల్లో మరింత వేగం

ఉమ్మడి జిల్లాకు చేరిన 108, 102 వాహనాలు

ఖమ్మంవైద్యవిభాగం: క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించడమే కాక గర్భిణులు, బాలింతలను ఆస్పత్రులకు తీసుకొచ్చి ఇళ్లకు చేర్చే 102 వాహనాలు కొత్తవి అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం ఉన్న వాహనాలు పాతబడిపోవడంతో తరచుగా మొరాయిస్తున్నాయి. దీంతో ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 466 కొత్త వాహనాలు కొనుగోలు చేయగా వీటిని మంగళవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించారు. ఇందులో నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు 38 వాహనాలు కేటాయించారు. వాటిలో 32 కొత్త వాహనాలు జిల్లాకు చేరగా, సెంటర్లకు పంపించారు. మిగతా ఆరు వాహనాలు రెండు, మూడు రోజుల్లో చేరుకుంటాయని 108 ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ భూమా నాగేందర్ తెలిపారు. ఉమ్మడి జిల్లాకు కేటాయించిన 108 వాహనాల్లో భద్రాద్రి కొత్తగూడెంనకు 11, ఖమ్మం జిల్లాకు ఎనిమిది పంపించగా, 102 వాహనాలు భద్రాద్రి కొత్తగూడెంనకు పది, ఖమ్మం జిల్లాకు 8 కేటాయించినట్లు వెల్లడించారు. అలాగే, భద్రాద్రి జిల్లాకు ఒక పార్థీవ వాహనం వచ్చిందని తెలిపారు. నూతన వాహనాల రాకతో అత్యవసర వైద్య సేవలు మరింత మెరుగు పడతాయని, క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించే సమయం తగ్గుతుందని భావిస్తున్నారు.





ఖమ్మం జనరల్ ఆస్పత్రిలో 108 నూతన వాహనం (ఇన్‌సెట్) 102 నూతన వాహనం

నేలరాలిన నిరుపేద కుసుమం

- ఉపాధి బాటలో లారీ ఢీకొనడంతో మృతి
- ఖమ్మంలో కన్నుమూసిన మానుకోట జిల్లా యువతి

ఖమ్మంక్రైం: కూలి పనిచేస్తున్న తల్లిదండ్రులకు సోదరుడితోపాటు తాను కూడా చేదోడుగా నిలవాలని భావించిన ఆ యువతి స్వగ్రామాన్ని వదిలి ఖమ్మంకు చేరుకుంది. ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ తల్లిదండ్రులకు ఆమె ఆసరాగా నిలుస్తుండగా.. విధి వక్రీకరించి మృత్యువు దరిచేర్చింది. ఖమ్మంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమె మృతి చెందగా వివరాలను టూటౌన్ పోలీసులు వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం



శ్రీకన్య (ఫైల్)

నీలికుర్తికి చెందిన పాక శ్రీకన్య (28) వైరాలోని ఇండేన్ గ్యాస్ ఏజెన్సీలో పనిచేస్తూ ఖమ్మం రాపర్తి నగర్‌లో నివాసముంటోంది. ప్రతిరోజు తన స్కూటీపై మరో యువతి మాలోతు రాణితో కలిసి వైరా వెళ్లివస్తోంది. రోజులాగే వీరిద్దరు బుధవారం వైరాకు వెళ్తుండగా శ్రీశ్రీ సర్కిల్ వద్ద వైరా నుంచి వరంగల్ వెళ్తున్న లారీ అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో స్కూటీ నడుపుతున్న శ్రీకన్య అక్కడికక్కడే మృతి చెందగా, వెనుకాల కూర్చున్న రాణికి తీవ్రగాయాలు కావడంతో జిల్లా ఆస్పత్రికి తరలించారు. కాగా, పోలీసులు ఇచ్చిన సమాచారంతో అన్నం ఫౌండేషన్ నిర్వాహకులు అన్నం శ్రీనివాసరావు యువతి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. శ్రీకన్య బీఈడీ పూర్తిచేసి ఐదేళ్లుగా గ్యాస్ ఏజెన్సీలో పనిచేస్తోంది. ఆమె మృతి చెందిన సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు ఈశ్వరమ్మ-భిక్షం ఆస్పత్రికి చేరుకుని గుండెలవిసేలా రోదిస్తుండటం అందరినీ కంటతడి పెట్టించింది. కాగా, యువతిని ఢీకొట్టిన లారీడ్రైవర్ ఆపకుండా బైపాస్ రోడ్డులో వెళ్తూ రోడ్డు పక్కనే ఉన్న కారుని సైతం ఢీకొట్టాడు. అయితే, కారులో ఉన్న వారికేమీ కాలేదు. చివరకు అక్కడే లారీని ఆపి పారిపోగా, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తోట నాగరాజు తెలిపారు.

ఓసీలో వరద నిల్వకుండా చర్యలు

వీసీలో ఆదేశించిన సింగరేణి సీఎండీ శ్రీధర్

సత్తుపల్లిరూరల్: సింగరేణి ఓపెన్ కాస్ట్‌ల్లో వర్షాకాలంలో నిలిచే నీటిని ఎప్పటికప్పుడు తోడివేయడానికి అవసరమైనన్ని మోటార్లు సిద్ధం చేసుకోవాలని, నీరు తొలగిస్తూ బొగ్గు ఉత్పత్తి, రవాణాకు అంతరాయం కలగకుండా చూడాలని సింగరేణి సీఎండీ శ్రీధర్ ఆదేశించారు. హైదరాబాద్ నుంచి బుధవారం ఆయన ఏరియాల వారీగా సింగరేణి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ వర్షాలతో బొగ్గు ఉత్పత్తికి ఆటంకాలు రాకుండా చూసుకోవాలని, ఒకవేళ ఉత్పత్తి నిలిచిపోయినా రవాణా చేసేందుకు వీలుగా బొగ్గు నిల్వ చేయాలని ఆదేశించారు. ప్రతీనెలా ఏరియాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని సీఎండీ స్పష్టం చేశారు. కాగా, సత్తుపల్లిలోని ఓసీ కార్యాలయం నుంచి వీసీకి కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలేంరాజు, అధికారులు రామకృష్ణ, వెంకటాచారి, నర్సింహారావు, రవీందర్, యోహాన్, మదన్‌మోహన్, రమణారెడ్డి హాజరయ్యారు.



సత్తుపల్లి నుంచి వీసీకి హాజరైన అధికారులు

యుద్ధప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ

ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు

కూసుమంచి: భారీ వర్షాలు, వరదతో దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేస్తూ సరఫరా పునరుద్ధరిస్తున్నామని ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ బుగ్గవీటి వెంకటేశ్వరరావు తెలిపారు. కూసుమంచి మండలంలోని పాలేరు ఏటి పరివాహక ప్రాంతంలో వరదలతో దెబ్బతిన్న స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు పనులను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఎన్పీడీసీఎల్ పరిధిలోని 17 జిల్లాల్లో వరదల కారణంగా రూ.45 కోట్ల మేర నష్టం వాటిల్లిందన్నారు. అందులో ఎక్కువగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నష్టం నమోదు కాగా ములుగు, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో కూడా నష్టం తీవ్రత ఉందని చెప్పారు. ఒక్క భూపాలపల్లి జిల్లాలోనే 10 వేల స్తంభాలు, 700 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినగా వేగంగా మరమ్మతు చేస్తున్నట్లు వెల్లడించారు. కాగా, వరదల సమయంలోనూ తమ సిబ్బంది విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా కృషి చేశారని గుర్తు చేశారు. జిల్లా ఎస్ఈ సురేందర్ మాట్లాడుతూ.. జిల్లాలో 950 స్తంభాలు, 180 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయని, పాలేరు, మున్నేరు, ఆకేరు పరీవాహకంలో ఎక్కువ నష్టం జరిగిందని చెప్పారు. మరో మూడు రోజుల్లో మరమ్మతులు పూర్తిచేసి అన్నిచోట్ల సరఫరా పునరుద్ధరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఈఈ నాగేశ్వరరావు, కూసుమంచి ఏడీఈ కోక్యానాయక్, ఏఈలు వెంకన్ననాయక్, గ్రేస్ సృజన పాల్గొన్నారు.



పాలేరు వద్ద మరమ్మతు పనులు పరిశీలిస్తున్న డైరెక్టర్, అధికారులు

డోర్నకల్ రూట్‌లో బస్సులు కొనసాగించాలి

ఖమ్మంమామిళ్లగూడెం: జీకే బంజర, డోర్నకల్ రూట్‌లో ఆర్టీసీ సర్వీసులు కొనసాగించాలని విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఖమ్మం ఆర్టీసీ డీఎం కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ మాట్లాడుతూ విద్యాసంవత్సరం ప్రారంభం కాగానే బస్సులను ఆపేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో విద్యాభ్యాసం కోసం ఖమ్మం వచ్చే కోటపాడు, చిమ్మపుడి, పాపటపల్లి తదితర గ్రామాల విద్యార్థులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు. వెంటనే బస్సు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సాధిక్, లక్ష్మి, రమ్య, యాకూబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

యంత్రాంగం నిర్లక్ష్యంతోనే వరద కష్టాలు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

చుంచుపల్లి/పాల్వంచ: అధికార యంత్రాంగానికి ముందుచూపు లేకపోవడంతోనే ఏటా వర్షాకాలంలో ఏజెన్సీ ప్రజలు ముంపు బారిన పడి నష్టపోతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఇటీవల వర్షాలతో దెబ్బతిన్న చుంచుపల్లి మండలం పెనుబల్లి బ్రిడ్జిని పరిశీలించిన అనంతరం ఆయన పాత కొత్తగూడెంలోని ఎస్సీ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ.. ఏటా ప్రజలు ముంపు బారిన పడుతున్నా శాశ్వత చర్యలు చేపట్టడంపై ఎవరూ దృష్టి సారించడం లేదన్నారు. పాల్వంచ చెక్‌డ్యామ్ నిర్మాణంలో నాణ్యత పాటించకపోవడంతో వరదలకు ధ్వంసమై రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. పెనుబల్లి వంతెన శిథిలావస్థకు చేరినా పట్టించుకోకపోవడంతో ప్రజలకు బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయని పేర్కొన్నారు. ఇకనైనా కంటితుడుపు చర్యలు కాకుండా వరద ముంపు నుంచి శాశ్వత రక్షణ కల్పించాలన్నారు. కాగా, ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలో దెబ్బతిన్న రహదారులు, కల్వర్టులను వెంటనే మరమ్మతు చేయాలని కూనంనేని డిమాండ్ చేశారు. పాల్వంచ పట్టణ పరిధిలోని నవభారత్ నుంచి శేఖరంబంజర వరకు దెబ్బతిన్న రోడ్లను ఆయన పరిశీలించి మాట్లాడారు. అలాగే, సమస్యలపై మున్సిపల్ కమిషనర్ స్వామితో ఫోన్‌లో చర్చించారు. కార్యక్రమాల్లో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్‌పాషా, నాయకులు వై.శ్రీనివాసరెడ్డి, సలిగంటి శ్రీనివాస్, వాసిరెడ్డి మురళి, కంచర్ల జమలయ్య, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, బాగం మహేశ్వరరావు, రెడ్డి శ్రీను, కిలారు ప్రసాద్, కూసపాటి శ్రీనివాస్, జ్యోతి, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, బండి నాగేశ్వరరావు, డి.సుధాకర్, అన్నారపు వెంకటేశ్వర్లు, శనగారపు శ్రీనివాసరావు, నరహరి నాగేశ్వరరావు, జకరయ్య, బిక్కులాల్, రామకృష్ణ, బాలు, గోపాల్‌రావు, వెంకట్రామయ్య జ్యోతి, లక్ష్మి, భద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.



పెనుబల్లి వంతెనను పరిశీలిస్తున్న కూనంనేని